

హుజూర్‌నగర్ ప్రజా ఆశీర్వాదసభకు పోటెత్తిన బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు

# కిక్కిరిసిన కృష్ణ పట్టె..

- సీఎం కేసీఆర్ సభలకు నదిలా జనప్రవాహం
- హుజూర్‌నగర్, మిర్యాలగూడ సభలకు బ్రహ్మరథం
- ఉమ్మడి నల్లగొండలో ప్రజాఆశీర్వాద సభలు విజయవంతం

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్31(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, అభిమాన నాయకుడు, సీఎం కేసీఆర్‌ను చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ఆయన చెప్పే మాటలు వినేందుకు ఊరూరా దారిబట్టారు. జనంహోరుతో కృష్ణపట్టె ప్రాంతమంతా గులాబీ ప్రవాహంలా హోరెత్తింది. కృష్ణా జలాల్లో నీటివాటాను కొట్లాడి సాధించుకొచ్చిన జలనేత కేసీఆర్‌కు నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు జనం నీరాజనం పట్టింది. మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని హుజూర్‌నగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల ప్రజలు కేసీఆర్‌కు బ్రహ్మరథం పట్టారు. గిరిజనులు అధికంగా ఉండే దేవరకొండ నియోజకవర్గంలో కేసీఆర్ కోసం జనం ప్రభంజనంలా తరలివచ్చారు. మూడు చోట్లా ఎటుచూసినా జనం చీమల దండులా ప్రజాఆశీర్వాద సభలకు తరలివచ్చి విజయవంతం చేశారు.

### జన జాతరను తలపించిన సభలు

హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభ జనంతో హోరెత్తింది. హుజూర్‌నగర్ పట్టణంతోపాటు ఏడు మండలాల నుంచి సభకు వేలాదిగా తరలివచ్చారు. పట్టణంలో చీమల దండు వరుసలా జన ప్రవాహం సభాస్థలి వరకు కొనసాగింది. మధ్యాహ్నం 2 గంటలకు సీఎం కేసీఆర్ హాజరవుతారని ప్రకటించగా ఉదయం 11 గంటల నుంచే జనం తండోపతండాలుగా తరలివచ్చారు. దళితబంధు గురించి ప్రస్తావించగానే పెద్దఎత్తున కేరింతలు వెల్లువెత్తాయి. రైతుబంధు వద్దు అనే ఉత్తమ్ కుమార్‌రెడ్డి కావాలా? ఉండాలనే సైదిరెడ్డి కావాలా? అని ప్రశ్నిస్తే సైదిరెడ్డినే అంటూ జనం ఒక్కపెట్టున కేకలు పెట్టారు. మిర్యాలగూడ ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభ జనజాతరను తలపించింది. నియోజకవర్గవ్యాప్తంగా జనం భారీగా తరలివచ్చారు. చీమలదండులా మధ్యాహ్నం 12 గంటల నుంచి మొదలైన జనప్రవాహం కేసీఆర్ వచ్చే వరకు విరామం లేకుండా కొనసాగింది. మిర్యాలగూడ పట్టణం ఎటుచూసినా గులాబీవనాన్ని తలపించింది. భాస్కర్‌రావును లక్ష మెజార్టీతో గెలిపించాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. దేవరకొండలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభకు జనం పోటెత్తారు. తండాలకు తండాలే సభకు తరలివచ్చాయి. దేవరకొండ ఖిల్లా గులాబీమయమైంది. 40 ఎకరాల్లో నిర్వహించిన బహిరంగ సభకు 80 వేలకు పైగా జనం తరలివచ్చినట్టు అంచనా. మహిళలు బతుకమ్మలు, కోలాటాలతో పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గిరిజనులు సంప్రదాయ వస్త్రధారణతో నృత్యాలు చేస్తూ పాటలు పాడి అలరించారు. ఆయా ప్రజాఆశీర్వాదసభల్లో మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, తిరునగర్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు తీయాలని చూశారు

## దేవుడి దయవల్ల ప్రభాకర్‌రెడ్డికి అపాయం తప్పింది: కేసీఆర్

- ప్రతిపక్షశక్తులకు బుద్ధిచెప్పాలి
- ఓటుతో చెంపఛెళ్లుమనిపించాలి
- పాత, కొత్త తేడా లేకుండా ముందుకు సాగాలి
- ఐక్యతకు సంకేతం గులాబీ సైన్యం: సీఎం కేసీఆర్
- బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి నాగం, విష్ణువర్ధన్
- గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన కేసీఆర్





మంగళవారం తెలంగాణ భవన్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, కరీంనగర్ నేత జైపాల్‌రెడ్డి. చిత్రంలో మంత్రి తలసాని, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తదితరులు

హైదరాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మీద దాడి చేసి ప్రాణాలు తీయాలను చూశారని, భగవంతుడి దయవల్ల ఆయన ప్రాణాలకు అపాయం తప్పిందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి దాడులు జరగలేదని అన్నారు. 'రాజకీయాల్లో ప్రతిపక్షశక్తులుంటాయి. ప్రగతి వ్యతిరేక శక్తులుంటాయి. ఆ శక్తులకు ప్రజాస్వామ్యయుతంగా బుద్ధిచెప్పాలి' అని కోరారు. మంగళవారం తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, కొల్లాపూర్ నేత రాంపుల్లారెడ్డి, కరీంనగర్ నేత జైపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ గులాబీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతించారు. కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణ అద్భుతమైన రాష్ట్రంగా రూపుదిద్దుకుంటున్నదని వివరించారు. తలసరి ఆదాయంలో, విద్యుత్తు వినియోగంలో, 24 గంటల కరెంట్ సరఫరా విషయంలో తెలంగాణ ముందున్నదని తెలిపారు.

### ఉద్యమ స్ఫూర్తి చాటాలి

పార్టీలో చేరిన మాజీ మంత్రి నాగం, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, వారి అనుచరులతోపాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రేణులు ఎక్కడిక్కడ ఐకమత్యంగా ముందుకు సాగాలని కేసీఆర్ సూచించారు. తెలంగాణవ్యాప్తంగా సైనికుల్లాంటి బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎక్కడిక్కడ పాత, కొత్త అనే తేడాలేకుండా ఐక్యతను ప్రదర్శిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని ఉద్బోధించారు. 1969 తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లిన నాయకుడిగా, తనతో కలిసి అనేక అంశాల్లో పోరాటం చేసిన నాయకుడిగా మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ నెమరువేసుకున్నారు. తనకు అత్యంత ఆప్తుడు పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం శుభపరిణామంగా అభివర్ణించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నాగం జనార్దన్‌రెడ్డి చేరికతో 14కు 14 సీట్లు గెలుచుకోవడం ఖాయమైందని, నాగం సలహాలు, సూచనలు తీసుకొని ముందుకు సాగాలని మంత్రి నిరంజన్‌రెడ్డి సహా ఇతర ప్రజాప్రతినిధులకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్‌లో విష్ణువర్ధన్‌రెడ్డి సహా వారి అనుచరులు, ఇప్పటికే బీఆర్ఎస్‌లో ఉన్న పార్టీ శ్రేణులను కలుపుకొని పోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీసుకోవాలని సూచించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ బీజేపీ కార్పొరేటర్లు మర్రి భావన, కచ్చు రవి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి సతీశ్ సైతం సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విష్ణువర్ధన్‌రెడ్డి భవిష్యత్తుకు నాది బాధ్యత: సీఎం కేసీఆర్

మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి భవిష్యత్తుకు తనదే బాధ్యత అని సీఎం కేసీఆర్ ప్రకటించారు. కాంగ్రెస్‌లో ఉంటూ తెలంగాణ ఉద్యమంలో అద్భుతంగా పనిచేసిన గొప్ప నాయకుడు పీజేఆర్ తనకు మిత్రుడని, ఆయన కొడుకు విష్ణు తనకు కుటుంబ సభ్యుడితో సమానమని చెప్పారు. హైదరాబాద్‌లో అనేక సమస్యలపై పోరాటం చేసిన పాపులర్ నాయకుడు పీజేఆర్ కుమారుడిగా విష్ణువర్ధన్‌రెడ్డికి యూత్‌లో మంచి క్రేజ్ ఉందని చెప్పారు. జూబ్లీహిల్స్‌తోపాటు హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా అందరూ కలిసి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు.

# వ్యవసాయ సమతుల్యతపై జర్మనీతో ఒప్పందం

- రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు, ఎమ్మెల్యే చెన్నమనేని

హైదరాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): భారత్, జర్మనీ సంయుక్తంగా చేపడుతున్న 'వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ సమతుల్యత' ప్రాజెక్టుపై బెర్లిన్‌లో మంగళవారం ఒప్పందం జరిగిందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ వెల్లడించారు. ఈ ఒప్పందంపై జరిగిన చర్చల్లో తనతోపాటు, జర్మనీ పరిశోధనల కేంద్రమైన ఫ్రాన్ హోఫర్ ప్రధాన సంచాలకులు డాక్టర్ సెబాస్టియన్ బొస్సె హాజరయ్యారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు సమన్వయకర్తగా డాక్టర్ రఘు చలిగంటి వ్యవహరిస్తారని తెలిపారు. వ్యవసాయ సమతుల్యత కోసం పరిష్కారాలు చూపడం దీని లక్ష్యమని తెలిపారు. 2021 నుంచి 2025 వరకు ఈ ప్రాజెక్టులో భాగంగా తెలంగాణతో జర్మనీ వ్యవసాయ మంత్రిత్వశాఖ విత్తనరంగంలో పరిశోధన, ప్రపంచ విస్తరణ కార్యక్రమంలో పరస్పరం సహకరించుకుంటాయని తెలిపారు. వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థలను బలపర్చడానికి మరో ప్రాజెక్టుపై చర్చలు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. మొదటి దశలో డిసెంబర్ 2023 నుంచి ఒక మిలియన్ యూరో నిధులతో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు జర్మనీ వ్యవసాయ మంత్రిత్వ శాఖ, తెలంగాణ వ్యవసాయ శాఖలు ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయమైన అగ్రిహబ్ (వ్యవసాయాధారిత పరిశోధన కేంద్రం), జర్మనీలోని పరిశోధన కేంద్రమైన ఫ్రాన్ హోఫర్ దీనిని అమలు చేయనున్నాయని తెలిపారు.



డాక్టర్ సెబాస్టియన్ బొస్సెతో సమావేశమైన రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు చెన్నమనేని

# మన రైతులు బిచ్చగాళ్లా?

మొదటిపేజీ తరువాయి...

సీఎం కేసీఆర్. రైతులకు ఏదో విధంగా పెట్టుబడి గోస తీర్చాలనే ఆలోచనతో ఆయన ప్రవేశపెట్టిన గొప్ప పథకం ఇది. అంతకు ముందు ఇలాంటి పథకం దేశంలో మరెక్కడా లేదు. ఇప్పటి వరకు రైతుబంధు కింద ప్రభుత్వం ఎకరాకు ఏటా రూ.10 వేల చొప్పున ఇస్తున్నది. దీన్ని వచ్చే ఎన్నికల తర్వాత ఎకరాకు రూ.16 వేలకు పెంచుతామని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ పథకాన్ని కాపీ కొట్టిన కాంగ్రెస్.. రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా పేరుతో ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించింది. అంటే బీఆర్ఎస్‌కన్నా రూ. వెయ్యి తక్కువగానే ఇస్తామని చెప్పారు. ఇలాంటిది ఆ పార్టీకి అధ్యక్షుడు రైతుబంధును, ఆ పథకాన్ని తెచ్చిన సీఎం కేసీఆర్‌ను విమర్శించడం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 50 ఏండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తమకు ఈ బిచ్చమెందుకు వెయ్యలేదో చెప్పాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తమను కష్టాల నుంచి గట్టెక్కిచ్చిన రైతుబంధు పథకంపై పిచ్చి కూతలు కూస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. రైతుబంధుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో నామరూపాల్లేకుండా చేస్తామని స్పష్టంచేస్తున్నారు.

### నేడు రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల అధికారులు

హైదరాబాద్, అక్టోబరు 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అసెంబ్లీ సాధారణ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను సమీక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు బుధవారం రాష్ట్రానికి రానున్నారు. సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నీతీశ్‌కుమార్ వ్యాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్‌కుమార్ నేతృత్వంలోని బృందం బుధవారం ఉదయం హైదరాబాద్ చేరుకుంటుంది. బీఆర్‌కేఆర్ భవన్‌లో రాష్ట్ర సీఈవో వికాస్‌రాజ్, ఇతర అధికారులతో కేంద్ర బృందం ఎన్నికల ఏర్పాట్లను సమీక్షిస్తుంది. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్‌తో భేటీ అవుతారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ అధికారులతోనూ సమావేశమై తనిఖీల అంశంపై సమీక్షిస్తారు. ఈ నెల 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఏర్పాట్లలో లోపాలు, సమస్యలను సమీక్షించి ఆదేశాలు, సూచనలు జారీ చేయనున్నారు.

# దేశానికి దిక్సూచి తెలంగాణ మాడల్

- బీడు భూములను పచ్చగా మార్చిన కేసీఆర్
- మత సామరస్యానికి మా రాష్ట్రం ప్రతీక
- మారిన స్థితిగతులే మా అభివృద్ధికి నిదర్శనం
- ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ కీలకోపన్యాసంలో కవిత



హైదరాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అభివృద్ధి మాడల్ దేశానికి దిక్సూచి అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. అతి తక్కువ సమయంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో అత్యంత వేగంగా తెలంగాణ సమ్మిళిత, సమగ్ర అభివృద్ధి సాధించిందని చెప్పారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో మంగళవారం 'డెవలప్‌మెంట్ ఎకనామిక్స్' అంశంపై జరిగిన సదస్సులో కవిత కీలకోపన్యాసం చేశారు. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణను గుర్తించిన ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ.. కీలకోపన్యాసం ఇవ్వడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆహ్వానించింది. ఈ సదస్సులో కవిత 'తెలంగాణ మాడల్'పై మాట్లాడుతూ.. పరిపాలనలో మానవీయ కోణాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరిస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్‌ను ఆమె అభినవ చాణక్యునిగా, అహింసా మార్గంలో రాష్ట్రాన్ని సాధించిన గాంధీగా అభివర్ణించారు. ఒకప్పుడు బీడువారిన భూములను పచ్చని పంటపొలాలుగా తీర్చిదిద్ది దేశానికి సీఎం కేసీఆర్ స్ఫూర్తిని ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి ఇచ్చిన వనరులను సద్వినియోగం చేసుకోవడంలో తెలంగాణ ముందున్నదని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రంలో ఒక్క మతకల్లోలం లేదని, మత సామరస్యానికి ప్రతీకగా ఉన్నదని తెలిపారు. తెలంగాణ మాడల్ అంటే ఆర్థిక గణాంకాలు కాదని, మారిన జీవన స్థితిగతులకు నిదర్శనమని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలోని 10 జిల్లాల్లో 9 వెనుకబడి ఉండేవని చెప్పారు. 2014కు ముందు రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉండేదని, ఇప్పుడు అటువంటివేమీ లేవని తెలిపారు. తలసరి ఆదాయం, తలసరి విద్యుత్తు వినియోగంలో దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తరువాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని రంగాల్లో తెలంగాణ అద్వితీయ ప్రగతిని సాధించిందని తెలిపారు.

### రికార్డు స్థాయిలో సాగునీటి విప్లవం

రికార్డుస్థాయిలో మూడున్నరేండ్లలోనే ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని కవిత వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులు మూడు పంటలు పండిస్తున్నారని, పండిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు వేగవంతంగా అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. 2014 నుంచి ఈ ఏడాది జనవరి వరకు రూ.3.31 లక్షల కోట్ల పెట్టుబడులతో 22,100 పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని, తద్వారా 22,36,000 ఉపాధి అవకాశాలను సృష్టించామని చెప్పారు. 2014లో రాష్ట్రం నుంచి రూ.57 వేల కోట్ల విలువైన ఐటీ ఉత్పత్తులు ఎగుమతి అయితే ఇప్పుడు అవి రూ.1.83 లక్షల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు.

# రాష్ట్రానికి కేంద్ర బలగాల పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కోసం ఈసారి అదనంగా మరో 70 నుంచి 75 కంపెనీల కేంద్ర బలగాలను రంగంలోకి దించుతున్నట్టు తెలిసింది. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం సుమారు 100 కంపెనీల బలగాలను రాష్ట్రానికి పంపింది. మరో 200 కంపెనీల సిబ్బందిని నోటిఫికేషన్ విడుదలైన తర్వాత సమస్యాత్మక ప్రాంతాల్లో మొదట మోహరించనున్నారు. 2018 ఎన్నికల్లో రాష్ట్రానికి 280 కంపెనీలతో సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించారు. ఈసారి ఆ సంఖ్యను మొదట 300 పెంచారు. ఇప్పుడు 70 నుంచి 75 కంపెనీలను అదనంగా కేటాయించనున్నట్టు సమాచారం. పొరుగు రాష్ట్రాల నుంచి ఎన్నికల విధుల కోసం 25 వేల మందిని కేటాయించినట్టు తెలిసింది.


TENDER NOTICE

ARMY COLLEGE OF DENTAL SCIENCES, Secunderabad

invites application from Conservancy and Security Services to Provide 49 staff. The details of RFP/Call for quotation is available in ACDS, Secunderabad website (www.acds.co.in). Interested agencies to submit quotation by hand or by Speed post by 15 Nov 2023.

By Registrar, ACDS.




యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి కోసం తయారుచేసిన చేనేత బంగారు పట్టు చీరను ప్రధానాలయంలో ఏఈవో రఘుకు అందిస్తున్న సిరిసిల్ల చేనేత కార్మికుడు నల్ల విజయ్

# 3 నుంచి నామినేషన్లు

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల సంఘం
- సీసీ కెమెరాల్లో ఆర్వో కార్యాలయాలు
- 10లోగా రాష్ట్రానికి రానున్న పరిశీలకులు

హైదరాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల కోసం శుక్రవారం ఉదయం (3న) భారత ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయనున్నది. అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల (ఆర్వో) కార్యాలయాలను సిద్ధంచేసింది. ఆయా కార్యాలయాల్లో 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 5వ ఆదివారం సెలవు కావడంతో నామినేషన్లు తీసుకోరు. ఒకే రోజు ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వస్తే వారికి స్లిప్‌లు ఇచ్చి అందరూ నామినేషన్లు వేసే అవకాశం కల్పించనున్నారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మంచి రోజులు ఉన్నాయని సమాచారం. ఈ మూడు రోజుల్లోనే ఎక్కువ సంఖ్యలో నామినేషన్లన్లు దాఖలవుతాయని అంచనా వేస్తున్నారు. నామినేషన్ రోజు నుంచి ఎన్నికల ఖర్చును పరిగణనలోకి తీసుకుంటారు.

### జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.10 వేల డిపాజిట్

రాష్ట్రంలో ఎక్కడ ఓటు ఉన్నా అభ్యర్థిగా పోటీ చేయవచ్చు. అయితే ఆయనను బలపరిచే వారు మాత్రం స్థానిక నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఈసారి ఈ నామినేషన్లలో మార్పులు చేసింది. అఫిడవిట్‌ను అసంపూర్తిగా నింపి ఇస్తే దానికి ఆర్వో నోటీసులు జారీ చేస్తారు. అభ్యర్థి దానిని సవరించాల్సిందిగా సూచిస్తారు. అప్పటికీ అభ్యర్థి స్పందించకుంటే నామినేషన్‌ను తిరస్కరించే అధికారం ఆర్వోకు ఉన్నది. నామినేషన్ దాఖలు చేయడానికి జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు ధరావత్తు కింద చెల్లించాల్సి ఉంటుంది.

### ఎన్నికల షెడ్యూల్ ఇలా

- 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 13వ తేదీన అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన
- 15న ఉపసంహరణ గడువు, తుది జాబితా ప్రకటన
- 30న ఉదయం 7 నుంచి 5 గంటలకు పోలింగ్
- డిసెంబర్ 3వ తేదీన ఎన్నికల ఫలితాల ప్రకటన

### 10న పరిశీలకుల రాక

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల పరిశీలకులు ఈ నెల 10న రాష్ట్రానికి రానున్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు, శాంతిభద్రతల పరిశీలకుడు, వ్యయ పరిశీలకుడు ఇలా ముగ్గురు పరిశీలకులను ఈసీ నియమించింది. సాధారణ పరిశీలకులుగా ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్ అధికారులు, శాంతిభద్రతల పరిశీలకులుగా ఐపీఎస్ అధికారులు, వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారులు రానున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు రాష్ట్రంలో ఉంటారు. వీరు ఎప్పటికప్పుడు, అభ్యర్థి, రాజకీయ పార్టీల కార్యకలాపాలు, సమావేశాలు, సభలను పరిశీలిస్తారు. పరిస్థితులపై ఎన్నికల సంఘానికి నివేదిక ఇస్తుంటారు.

# లక్ష్మీనారసింహుడికి అగ్గిపెట్టెలో బంగారు చీర

- సిరిసిల్ల చేనేత కార్మికుడు విజయ్ బహూకరణ
- ఆలయ ఏఈవో రఘుకు పట్టుచీర, శాలువా అందజేత

యాదగిరిగుట్ట, అక్టోబర్31: సిరిసిల్ల చేనేత కార్మికుడు తను తయారు చేసిన బంగారు పట్టు చీరను యాదగిరిగుట్ట లక్ష్మీనారసింహస్వామికి సమర్పించారు. మంగళవారం చేనేత కార్మికుడు విజయ్ అగ్గిపెట్టెలో ఒదిగిన బంగారు పట్టుచీర, స్వామివారికి పట్టుశాలువాను ఆలయ ఏఈవో రఘుకు అందజేశారు. స్వయంభూ నారసింహస్వామివారిని దర్శించుకొని పూజలు చేసిన అనంతరం విజయ్ మాట్లాడుతూ.. తన తండ్రి నల్ల పరంధామయ్య వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని చేనేత రంగంలో ఎన్నో అద్భుతాలు సృష్టించినట్టు చెప్పారు. 2 గ్రాముల బంగారాన్ని వినియోగించి 15 రోజుల పాటు శ్రమించి అగ్గిపెట్టెలో పొదిగే పట్టుచీరను తయారు చేశానని తెలిపారు. గతంలో విజయవాడ కనకదుర్గమ్మ తల్లికి, తిరుమల శ్రీవారికి అగ్గిపెట్టెలో పొదిగిన వస్త్రాలను బహూకరించినట్టు వెల్లడించారు. సీఎం కేసీఆర్.. స్వామివారి ఆలయాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దారని, ఈ నేపథ్యంలో స్వామి, అమ్మవార్లకు స్వయంగా నేసిన పట్టుచీరను బహూకరించానని విజయ్ తెలిపారు.


